క్లుప్తంగా

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెండ్లిమర్రి : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ధన్–ధాన్య కృషి యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. వెల్లటూరు సొసైటీలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ పథకం ప్రారంభం తర్వాత ఆయన రైతులతో మాట్లాడారు. రైతుల సంక్షేమే లక్ష్యంగా ఈపథకాన్ని రూపొందించారన్నారు. ఈ పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌సీఓ గోపికృష్ణ, సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, డీపీడీఎం ప్రసాద్, ఈసీఓ సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని సంజీవపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 ఖోఖో పోటీలలో ఏపీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. కళాశాలకు చెందిన బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే చంద్రకళ, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.అనిలా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వీరిని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, పీడీ సుశీలమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశాంతంగా జీవించండి

కొండాపురం : ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలని తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ ఆర్.శివనాగిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలో యనమలచింతల గ్రామంలో రౌడీషీటర్లకు, ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఇన్‌చార్జి పి.నరేన్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి కుమారుడు నూతన వధువరులైన శంకర్‌రెడ్డి, భారతిల వివాహం శనివారం పాతసంగటిపల్లెలో జరిగింది. వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మాజీ మేయర్ సురేష్‌బాబు, నియోజవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి, రాష్ట్ర సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర ఎస్‌ఈసీ సభ్యుడు సాయినాథ్ శర్మ, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి, మండల కన్వీనర్ రమణారెడ్డిలు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సంక్షేమాన్ని మరిచిన కూటమి ప్రభుత్వం

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సహకారంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారి సంక్షేమాన్ని మరిచిందని బహుజన టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున పేర్కొన్నారు. శనివారం కడపలోని బహుజన టీచర్స్ యూనియన్ (బి టి యు ఏ పి) సంఘ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని మరచి పోయి ప్రవర్తిస్తోందని, ఇది దురదృష్టకరమన్నారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టలేదన్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్ ఉన్నాయని, పీఆర్సీకి సంబంధించి కమిటీ వేయలేదని, ఐ. ఆర్ ప్రకటించలేదని, ఇది చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ బాబు మాట్లాడుతూ ఆర్థిక అంశాలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులను వేధించడం మంచిది కాదని అన్నారు. పాలకులు తమంతట తాము పాలన బాగుందని అనుకోకూడదని, ఉద్యోగులలో ఉన్న తీవ్ర నిరాశ, బాధను గమనించాలని అన్నారు. శాసనమండలిలో గౌరవ శాసనమండలి సభ్యులు ఉద్యోగులకు రావలసిన ఐ ఆర్ గురించి పెండింగ్‌లో ఉన్న డీఏ ల గురించి పీఆర్సీ గురించి ఎన్నో సార్లు ప్రస్తావించినప్పటికీ, అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్లు విన్నవించుకున్నప్పటికీ, ధర్నాలు చేసినప్పటికీ కూడా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమని అన్నారు.

రబీ సాగుకు శనగ విత్తనాలు మంజూరు

వేముల : ఈ ఏడాది రబీ సాగుకు సబ్సిడీపై శనగ విత్తనాలు మంజూరయ్యాయి. పులివెందుల నియోజకవర్గానికి 7900 క్వింటాళ్ల శనగ విత్తనాలను మంజూరు చేశారు. వీటిని 25 శాతం సబ్సిడీతో అందించనున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు లేవు. దీంతో పంటలు సాగు కాలేదు. ఖరీఫ్ సాగుకు పదును వర్షాలు లేక రైతులు పొలాలను బీళ్లుగా ఉంచుకున్నారు. రబీ సాగుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా శనగ పంట 50 వేల ఎకరాలకుపైనే సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసుకున్నారు. రబీ శనగ పంటను ఈనెల చివరి వారంలో కానీ, నవంబర్ మొదటి వారంలో రైతులు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసి భూములు పదునుగా అయ్యాయి. అయితే తుఫాన్ వర్షాలు ఒక ప్రాంతంలో పదును వర్షాలు పడితే మరో ప్రాంతంలో ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. శనగ సాగు అదునులో సాగైతే మంచి దిగుబడులు ఉంటాయన ఆశ రైతులలో నెలకొంది.


వేములలో సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

పంట సాగులో పెరుగుతున్న పెట్టుబడులు

ఏడాదికేడాది పంట సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. ట్రాక్టర్‌కు ఎకరాకు రూ.7వేలతో సేద్యం చేయించారు. అంతేకాక రసాయనిక ఎరువుల ధరలు కూడా పెరిగిపోయాయి. బస్తా ఎరువుపై 50 నుంచి రూ.100ల వరకు ధరలు పెరగడంతో రైతుల పంట సాగుకు భయపడుతున్నారు. అయినా రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

సబ్సిడీపై పెదవి విరుస్తున్న రైతులు

ప్రభుత్వం రబీ సాగుకు శనగ విత్తనాలను అందించే సబ్సిడీపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఖరీఫ్‌లో పంటలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను మంజూరు చేయడంపై రైతులలో ఆందోళన వ్యక్తమవుతోంది. సబ్సిడీపై క్వింటా శనగ విత్తనాలను రూ.5850లతో రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ దరతో శనగలు బయట మార్కెట్‌లో కూడా దొరుకుతున్నాయని, సబ్సిడీ ఇచ్చినా ప్రయోజనం లేదనే వాదన రైతులలో వినిపిస్తోంది. సబ్సిడీ శనగ విత్తనాలను 20 కిలోల ప్యాకెట్ రూ.1170లను రైతులు చెల్లించాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు మంజూరయ్యాయని రైతులు అంటున్నారు. అలాగే రైతుకు గరిష్ట 10 ప్యాకెట్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఎకరాకు 20కిలోల ప్యాకెట్లు రెండు చొప్పున రైతులకు అధికారులు పంపిణీ చేయనున్నారు.

మండలాల వారీగా శనగ విత్తనాల మంజూరు వివరాలు

మండలం	శనగ విత్తనాలు (క్వింటాలలో)
పులివెందుల	500
వేముల	1400
వేంపల్లె	1000
లింగాల	1100
తొండూరు	1200
సింహాద్రిపురం	2700

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ

తొండూరు : సమాజంలో ప్రతి బాలికకు సమాన అవకాశాలు ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య తెలిపారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు బాలికల హక్కులు, సాధికారత, సమాజంలో బాలికల పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాబున్నీ, వసంతకుమారి, ఏఎన్‌ఎం నాగేశ్వరి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణ హాస్పిటల్ ఆకస్మిక తనిఖీ

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో ఉన్న అరుణ హాస్పిటల్ పై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజా మొహిద్దిన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు అరుణ హాస్పిటల్‌లో ఇద్దరు మహిళలకు కాన్పులు చేస్తుడటం గమనించారన్నారు. నెలక్రితం అరుణ హాస్పిటల్ లో కాన్పులు చేస్తుండగా సీజ్ చేశామని తెలిపారు. సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినా కూడా సీజ్ చేసిన హాస్పిటల్ ను తెరచి కాన్పులు చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. అయితే అక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా కాన్పులు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పోలీసుల సహకారంతో తనిఖీ నిర్వహించి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వీడియోలు తీసి పంపించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


హాస్పటల్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ఇలా ఉంటే.. రోగాలు రావా


చిలంకూరులోని గుంతబజారులో ఊటనీరుతో నిండిన రోడ్డు

ఎర్రగుంట్ల : వర్షాలు కురవడంతో వాతావరణం కలుషితమై పలురకాల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముంది. పరిసరాల పరిశుభ్రం విషయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. వైద్య శాఖ అధికారలు పలుమార్లు హెచ్చరిస్తున్న స్థానికంగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన పలు రాకల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. దీంతో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులన్నీ రోగులకు నిండిపోతున్నాయి. పట్టణంలోని పేర్ల శివారెడ్డిపీ.ధిలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న వీధులన్నీ మురికినీటితో నిండిపోయాయి. అలాగే చిలంకూరులోని గుంతబజారులో ఊటనీరంత రోడ్లపైన ప్రవహించి పాచిపట్టి ఉన్నాయి. వర్షాలు కురవడం వలన ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ చేరింది. దోమలు వృద్ధి చెందడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికై న అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ చట్ట సవరణ బిల్‌ను వ్యతిరేకించండి

ఎర్రగుంట్ల : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్ చట్ట సవరణ ముసాయిదా బిల్ 2025 మీద రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాల కొరకు కేంద్రం పంపించిందని ఈ ముసాయాదాను ఏపీ ప్రభుత్వం వ్యతిరేఖించాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. సుబ్బిరెడ్డి కోరారు. శనివారం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ బిల్ పార్లమెంట్ ఆమోదం పొంది చట్టంగా మారితే మొత్తం విద్యుత్ రంగం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందన్నారు. దీంతో ప్రభుత్వ డిస్కంలు మరింత నష్టాల్లోకి కూరుకుపోయి చివరకు దివాళా తీసే పరిస్థితి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తెలిపారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి


కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో పని చేస్తున్న వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రెవిన్యూ కార్యాలయంలో వీఆర్‌ఏల జిల్లా సంఘం విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని పెద్దముడియం ,జమ్మలమడుగు ,కొండాపురం ,ముద్దనూరు, రాజుపాలెం మండలాల పరిధిలోని వీఆర్‌ఏలకు సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈనెల 15న విజయవాడలో జరిగే వీఆర్‌ఏల ఆందోళన జయప్రదం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామ సేవకులకు గత ఎనిమిది సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు . తాత ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్న గ్రామ సేవకులకు తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, జిల్లా నాయకులు మద్దెల రవి, వెంకట సుబ్బయ్య, సుబ్బరాయుడు, ప్రతాప్, ప్రసాదు, మహ్మద్ బాషా, సుబ్బరాయుడు , డివిజన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు ట్రావెల్స్ ను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రోడ్డు రవాణా శాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. ఆ కారణంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఫిట్నెస్ సరిగ్గా లేకపోవడంతో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బ్రేక్ ఫెయిల్ అయిన సంఘటన చూశామన్నారు. అయితే ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరుగలేదని అన్నారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న పీ రవీంద్రనాథ్‌రెడ్డి


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరు మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో శనివారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుల నూతన విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామి వార్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. వైఎస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, కమలాపురం నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులురెడ్డి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అర్చకులు, నిర్వాహకులు వారిని సన్మానించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

పులివెందుల రూరల్ : బ్రాహ్మణపల్లి రోడ్డులోని సుంకులమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభానికి తీగజాతి మొక్క అల్లుకుపోతుంది. ఇది ప్రధాన రహదారికి పక్కనే ఉంది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రమాదం జరగక ముందే తీగజాతి మొక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగజాతి మొక్క

బడులు, గుడుల వద్ద పెట్టిన వైన్ షాపులు రద్దు చేయాలి

కడప కార్పొరేషన్: కడపలో బడి, గుడుల వద్ద ఏర్పాటు చేసిన వైన్ షాపులను రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కార్నర్ మీటింగుల్లో ఎమ్మెల్యే మాధవి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని నైతికత నిరూపించుకోవాలన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపలో ఎమ్మెల్యే మాధవి మద్యం షాపులు, బార్లను ప్రోత్సహిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదారు వైన్ షాపులు మాత్రమే ఉండగా, ఇప్పుడు 25 మద్యం షాపులు ఏర్పాటు చేశారని, ఇవిగాక పది బార్లు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం రూ.9 కోట్లు ఖర్చు చేసి రాజీవ్ మార్గ్‌ను , రాజీవ్ పార్కును అభివృద్ధి చేసిందన్నారు. ఆహ్లాదకర ఈ మార్గంలో మహిళలు, సీనియర్ సిటిజన్లు ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుంటారని, ఇక్కడ లేడీస్ హాస్టళ్లు, పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇలాంటి చోట ఈ ప్రభుత్వం వైన్ షాపు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. నిరుపయోగంగా ఉన్న స్కూల్ భవనంలో తాను మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరకు నీటిని అందిస్తుంటే ఓర్వలేక ఖాళీ చేయించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి డివిజన్‌కు రెండు సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజా సంక్షేమ పథకాలను ఇంటివద్దకే చేర్చిందని, కూటమి ప్రభుత్వం ప్రతి డివిజన్‌లో ఒక వైన్ షాపు, ఒక బార్ ఏర్పాటు చేస్తోందని ఎద్దేవా చేశారు.

రెవెన్యూ సహాయకులకు పదోన్నతులు కల్పించాలి

జమ్మలమడుగు రూరల్ : గ్రామ రెవెన్యూ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచి, పదోన్నతులు కల్పించాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కార్యదర్శులు బి.గురుమోహన్, వెంకటపతిలు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో యూనియన్ గౌరవాధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సహాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వస్తే గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీలు ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు నూతన కమిటీ ఎంపికను నిర్వహించారు. జమ్మలమడుగు డివిజన్ అధ్యక్షుడిగా రాగాల ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బి.సుబ్బరాయుడు, కార్యదర్శులుగా బాషా, ట్రెజరర్ సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజహుసేన్, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కమిటీ సభ్యులు

విద్య, వైద్యం ప్రైవేట్‌పరం చేస్తే సహించం

- ప్రజలతో కలసి పోటెత్తుతాం
- కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ధ్వజం

కమలాపురం : కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పీపీపీ విధానం పట్ల శ్రద్ధ చూపుతోందని, విద్య, వైద్యాన్ని ప్రైవేట్ పరం చేస్తే సహించేది లేదని, ప్రజలతో కలసి పోటెత్తుతామని కమలాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ఉద్యమం పోస్టర్లు ఆయన అన్ని మండలాల నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి విద్య, వైద్యంను ప్రైవేట్ పరం చేస్తోందని దీంతో ప్రజలు ఇళ్లు, వాకిళ్లు అమ్ముకోవాల్సిందేనని, పీపీపీ విధానాన్ని సహించేదిలేదని, ప్రజలతో కలసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జగనన్న హయాంలో వచ్చిన 17 మెడికల్ కళాశాలల్లో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారన్నారు. ఎన్నికల కంటే ముందే ఈ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వారికి అప్పజెబుతానని వారికి హామీ ఇచ్చి ఉంటారన్నారు. 1999–2004 బాబు హయంలో 3 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆ సమయంలో పాదయాత్ర చేసిన మహానేత వైఎస్సార్ రైతులకు ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. 2004లో అధికారంలోకి రాగానే వైఎస్సార్ రిటైర్డ్ జడ్జీలతో కమిటీ వేసి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలు తెలుసుకున్నారని గుర్తు చేశారు. పిల్లలను చదివించుకోలేక, వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతూ రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కమిటీ సూచనతో ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను వైఎస్సార్ ప్రారంభించారన్నారు. జగనన్న సైతం ఆరోగ్య శ్రీ సేవలను విస్తరించి, అనుబంధంగా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ రెండు మాసాలుగా వైఎస్సార్ సీపీ పలు నిరసనలు వ్యక్తం చేసినా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. దీంతో ప్రైవేటీకరణను నిరసిస్తూ జగనన్న వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారని, దీనిని ప్రతి కార్యకర్త కలిసి ప్రతి గ్రామంలో పర్యటించి సంతకాలు సేకరించి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు 15 ఏళ్ల ముఖ్యమంత్రి అయినప్పటికి భ్రమల్లో బతుకుతున్నాడని వైఎస్సార్ సీపీ కమలాపురం పరిశీలకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. అన్ని తానే కనుగొన్నట్లు గొప్పలు చెప్పుకోవడం తప్పా 15 ఏళ్ల కాలంలో ఒక్క మెడికల్ కళాశాల అయినా తెచ్చాడా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కమలాపురం, చెన్నూరు మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు రఘునాథరెడ్డి, వీరారెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఇతర నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, బాలయ్య, చీర్ల సురేష్, శంకర్‌రెడ్డి, కొండారెడ్డి, చెన్నకేశవరెడ్డి, గండి భాస్కర్, రామసుబ్బారెడ్డి, ఇస్మాయిల్, జావీద్, జిలానీ బాషా, మోనార్క్, మునీంద్రారెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : రాష్ట్రంలో మెడికల్ కాలేజిలను ప్రైవేట్ పరం చేసి నిరుపేదలకు కార్పొరేట్ వైద్యంతో పాటు నిరుపేద విద్యార్థులు డాక్టర్లు కాకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని గూడుమస్తాన్‌వలి దర్గావద్ద కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజిలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలతో కోటి సంతకాల కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి దర్గా వద్ద 116 టెంకాయలను కొట్టి స్వామి వారికిపూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అసత్య హామీలతో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. ప్రతి ఒక్కరు కూటమి తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలన పూర్తిగా దోచుకో దాచుకో అన్న పద్ధతిలో మాత్రమే సాగుతుందన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముల్లాజానీ, నూర్జహాన్, గౌరి, షామీర్ ఆలీ, ఫయాజ్‌బాషా, హాజీకమిటీ మాజీ చైర్మన్ గౌస్‌లాజం, వైఎస్సార్‌సీపీ జిల్లా మున్సిపాలిటీ అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


కమలాపురంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లు విడుదల చేస్తున్న నరేన్ రామాంజులరెడ్డి


జమ్మలమడుగులో సంతకాల సేకరణలో రామసుబ్బారెడ్డి

రాయలసీమకు తీవ్ర అన్యాయం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధాని మోదీ పాలనలో విభజన హామీలు అమలు చేయకపోగా రాష్ట్రానికి రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సీమకు ఏమీ చేయని ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలుకు ఏ ముఖం పెట్టుకొని వస్తాడని ఆయన విమర్శించారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.